క్లుప్తంగా

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెం, శివరం గాపురం పాఠశాలలను మంగళవారం ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బోధన తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం, పాఠశాల రికార్డులు పరిశీలించారు. అనంతరం ప్రైవేటు పాఠశాలలు సందర్శించారు. ఫిట్‌నెస్ లేని బస్‌లు వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఆర్పీ పాపయ్య, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాలతో రివ్యూ మీటింగ్



ఉండవెల్లి(మానవపాడు): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మండల వైద్యాధికారి డా.యాకుబ్ బాషా ఆశా కార్యకర్తలతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. యాకుబ్ బాషా మాట్లాడుతూ.. గ్రామాల్లో గర్భిణులను గుర్తించి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. నార్మల్ డెలివరీలపై అవగాహన కల్పించాలన్నారు. రక్త హీనత ఉన్న వారికి మందులు అందజేయాలన్నారు. నవజాత శిశువులు గుర్తించి, వారి పెరుగుదలపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీఎస్ సంధ్య, చంద్రన్న, హెల్పర్ అక్కమ్మ, సూపర్‌వైజర్ సోని, తిరుమల్ రావు, ఆశాలు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



కేటీదొడ్డి: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులతో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్య సిబ్బంది మోహన్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని మల్లాపురం గ్రామంలోని ఆవులు ఎద్దులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో గోపాల మిత్రలు గోపాల్ రెడ్డి, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



అలంపూర్: నియోజకవర్గంలోని ఎర్రవల్లి మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన షాలి మియా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను సంప్రదించగా అతని వైద్య చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే విజయుడు రూ.5 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం



గద్వాల రూరల్: మండలంలోని గోన్‌పాడులో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మొబైల్ యాప్ ద్వారా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. స్త్రీలు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా తమ హక్కులు సాగించుకోవాలనే లక్ష్యంతో అఖిల భారత మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. మహిళలు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజశేఖర్ రెడ్డి, ఆనంద్ గౌడ్, శ్రీనివాసులు, నాగరాజు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికి ప్రణాళికలు సిద్ధం



ఉండవెల్లిలో ఏర్పాటు చేసిన నర్సరీ(ఫైల్)

- గ్రామ సభల ద్వారా పనుల ఎంపిక
- ఈజీఎస్‌తో గ్రామాల అభివృద్ధి
- రైతులు పనులు తెలపాలంటున్న అధికారులు

ఉండవెల్లి: పేదలకు వంద రోజుల పాటు పని కల్పించి వారు ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టడానికి మండల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 2025–26 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీలో ఎలాంటి పనులు చేపట్టాలన్న దానిపై



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు కూడా నిర్వహించారు. గ్రామ సభల్లో తీర్మానం చేసిన పనులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపడుతున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాం. గ్రామాల్లో ఏఏ పనులు చేయాలో తీర్మానాలు కూడా చేశారు. గ్రామాల్లో చేయాల్సిన పనుల వివరాలు సేకరించి త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– తిరుపతన్న ఇన్‌చార్జి ఎంపీడీఓ

ఉపాధి హామీలో చేపట్టనున్న పనులు..

మురుగు నీరు రోడ్లపై పారకుండా ఇంకుడు గుంతలు, పశువుల దాహాన్ని తీర్చేందుకు నీటి తొట్టెలు, పాఠశాలలో వంట గదులు, టేకు మొక్కల పంపిణీ, రైతుల భూములు సారవంతం చేయడానికి చెరువు మట్టిని తరలించే పనులపై తీర్మానం చేశారు. కందకాల తవ్వకం, పంట చేల వద్దకు రోడ్ల నిర్మాణం, సాగు నీటి కాలువల పూడికతీత తదితర పనులు చేపట్టనున్నారు.

పాత పనుల్లో నిమగ్నమైన అధికారులు..

2024–25 సంవత్సరానికి చెందిన పనులు అధికారులు ప్రస్తుతం పూర్తి చేస్తున్నారు. కొత్త పనులకు అప్లికేషన్లు తీసుకునే సమయంలో పాత వాటికే పరిమితమయ్యారు. గ్రామాల్లో పంట పొలాల వద్ద రోడ్లు కూడా వేయలేని పరిస్థితి ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల చొరవ చూపి త్వరితగతిన పనులు చేపట్టాలని కోరుతున్నారు.

హడావుడిగా సమగ్ర సర్వే



గద్వాల అర్బన్: ఈ నెల 6 నుంచి ప్రభుత్వం హడావుడిగా సమగ్ర కుటుంబ సర్వే మొదలు పెట్టడం విడ్డూరమని వివిధ సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమగ్ర కుటుంబ సర్వేపై ప్రజల్లో అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. 6వ తేదీన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు జిల్లా పర్యటనకు వస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవనంలో సమావేశం నిర్వహించనున్నామని..బీసీలు అధిక సంఖ్యలో తరలివచ్చి సమావేశం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు అచ్చన్న గౌడ్, బహుజన రాజ్యసమితి అధ్యక్షుడు వాల్మీకి, కార్యదర్శి వినోద్‌కుమార్, కుర్వ రాములు, రమేష్ గౌడ్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే టెట్ నిర్వహించాలి



అయిజ: పాత పద్ధతిలోనే టెట్ నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అయిజలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం అనుసరిస్తున్న కొత్త విధానాలతో నిరుద్యోగ యువతకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఆన్‌లైన్‌లో టెట్ నిర్వహించడం.. ఒకే పరీక్షకు వేర్వేరు ప్రశ్నపత్రాలు ఇవ్వడంతో ఒకరోజు సులభంగా, మరో రోజు క్లిష్టంగా పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష అంటే ఒకే పేపర్, ఒకే రోజు ఉంటుందని.. అందుకు విరుద్ధంగా టెట్ నిర్వహించడం వల్ల తక్కువ మార్కులు వస్తున్నాయన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ఒకే ప్రశ్నపత్రంతో ఒకే రోజు పరీక్ష నిర్వహించారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడటం తగదన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, పట్టణ కన్వీనర్ ప్రదీప్‌స్వామి, కోకన్వీనర్ భగత్‌రెడ్డి, జనార్దన్, మధు, రామాంజనేయులు ఉన్నారు.

సోషల్ మీడియాలో చక్కర్లు



అయిజ: మున్సిపాలిటీకి చెందిన ట్రాక్టర్‌తో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని.. చెత్త సేకరించే సమయంలో ఇసుక సేకరిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న ఇంటి ముందు ఉన్న ట్రాక్టర్‌ను ఫొటో తీసి ఓ వ్యక్తి మంగళవారం సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అది అన్ని గ్రూపుల్లో చక్కర్లు కొట్టడంతో తహసీల్దార్ జ్యోతి, మైనింగ్ అధికారి రమణ, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ రమణ విచారణ చేశారు. మున్సిపల్ చైర్మన్‌ను వివరణ కోరగా.. ఎస్సీ కాలనీలో రోడ్డు మరమత్తుకు కాంట్రాక్టర్ వెంకట్రాములుకు సంబంధించిన ఇసుక, కంకర మున్సిపల్ ట్రాక్టర్‌తో తరలించినట్లు తెలిపారు. సొంత ఖర్చులతో సిమెంట్ కొనుగోలు చేసి రోడ్డుకు మరమత్తులు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ సొమ్ముతో జల్సాలు



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

గద్వాల అర్బన్: స్థానిక ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్‌లోకి ఎందుకు వెళ్లారని.. మళ్లీ నేను బీఆర్‌ఎస్‌లోకి ఎప్పుడు వెళ్తానోనని అంటున్నట్లు వార్తలు వస్తున్నాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కురువ విజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్వాలలో ప్రజలు కష్టాల్లో ఉంటే ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి మాత్రం ప్రభుత్వ సొమ్ముతో విదేశాల్లో జల్సాలు చేస్తున్నారని విమర్శించారు. బిజ్వారం గ్రామానికి చెందిన మైనర్ బాలిక మృతికి కారణమైన బండ్ల రాజశేఖర్ రెడ్డిని అరెస్టు చేయకుండా ఎమ్మెల్యే పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చి కాపాడుతున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ కార్యాలయానికి సంబంధించిన డాక్యుమెంట్లను పార్టీ అధిష్టానానికి అప్పగించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య, మల్లికార్జున్, ప్రతాప్, బీచుపల్లి, రవి, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలు హరిస్తారా..

రాజోళి: ప్రాణాంతక వ్యాధులకు కారణమయ్యే ఫ్యాక్టరీలు పెట్టి ప్రజల ప్రాణాలు హరిస్తారా అని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెద్ద ధన్వాడలో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీ ప్రదేశాన్ని మంళవారం ఆయన సందర్శించారు. కార్పొరేటర్లకు ప్రజల ప్రాణాలంటే లెక్క లేదన్నారు. ప్రాణాంతక ఫ్యాక్టరీలు పెట్టే యాజమాన్యాలకు 12 గ్రామాల ప్రజలు చూపించే వ్యతిరేకత కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, ఎంపీ డీకే అరుణ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య, నారాయణ, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇథనాల్ కంపెనీ ఎత్తివేయాలి

గద్వాల అర్బన్: రాజోళి మండలం పెద్ద ధన్వాడలో ప్రజల ప్రాణాలకు పెను ముప్పు కలిగించే ఇథనాల్ కంపెనీ ఎత్తివేయాలని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్ పాష, కోకన్వీనర్ హనుమంతు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న పోరాటం న్యాయమైందన్నారు. అదే విధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బీసీ కులగనణ సర్వేలో పౌరుల ప్రజాస్వామిక హక్కుగా నో కాస్ట్, నో రిలీజియన్ ఆప్షన్ కాలమ్ చేర్చాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ అడ్డగోలు బాదుడు

వనపర్తి టౌన్: వనపర్తి ఆర్టీసీ డిపోలో పర్యవేక్షణ కొరవడడం, టిమ్స్‌లో ఫీడింగ్ తప్పిదాలతో ప్రయాణికులపై భారం పడుతోంది. వనపర్తి నుంచి హైదరాబాద్‌కు రూ. 290 (పెయిర్) టికెట్ ధర ఉండగా.. ఈ నెల 4న సూపర్ లగ్జరీ బస్సులో రూ.400 చొప్పున టికెట్ వసూళ్లు చేయడంతో ప్రయాణికులు ఇదేంటని అడిగితే డ్రైవర్‌ను ప్రశ్నించగా తమ చేతుల్లో ఏమీ లేదని చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్టీసీ డీఎంను వివరణ కోరగా.. డ్రైవర్ తప్పిదమని, పండుగల సమయంలో ప్రత్యేక బస్సులు నడిపిన సమయంలో ఏర్పాటు చేసిన టిమ్ ల ద్వారా టికెట్లు ఇవ్వడంతో ఈ పొరపాటు జరిగిందన్నారు. ప్రయాణికుల నుంచి అభ్యంతరాలు వచ్చిన వెంటనే టిమ్ మిషన్లను సవరించామని తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి తదితరులు

ధరూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మండల పరిధిలోని రేవులపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. జోనల్ స్థాయి కబడ్డీ పోటీల్లో అండర్–14 కబడ్డీ విభాగంలో ధరూరుకు చెందిన అనిల్, రేవులపల్లికి చెందిన అండర్–14 బాలిక విభాగంలో కే.జ్యోతి ప్రతిభ కనబరిచారు. వీరు ఈనెల 7వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పాఠశాల జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, పీఈటీలు అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు..

శాంతినగర్: రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు తనగల పాఠశాల విద్యార్థిని ఎంపికైంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అయిజ మండలం కిష్టాపురానికి చెందిన విద్యార్థిని చంద్రకళ ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులు అవలంబించాలి

మల్దకల్: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంభించి మంచి దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ అన్నారు. మంగళవారం మల్దకల్ రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయాధికారులతో పాటు రైతులు పాల్గొన్నారు. మొక్కజొన్న, మినుముల పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు హరిక, ఖాజాపాష, కిశోర్, జోహనా పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ



క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్

గద్వాల రూరల్: నవభారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేలు విలువ జేసే క్రీడా దుస్తులను మంగళవారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ శ్రీనివాసులు గౌడ్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంపొందించి క్రీడల అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ నేపథ్యంలో ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీహరి, ఉపాధ్యాక్షుడు కృష్ణయ్య, ఉపాధ్యాయులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు ఏర్పాట్లు పూర్తి

గట్టు: కుటుంబ సమగ్ర సర్వేకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ చెన్నయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీల్లో 16,695 ఇళ్లను సర్వే చేసేందుకు మొత్తం 101 బ్లాక్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కొక్క బ్లాక్‌కు ఒక ఎన్యూమరేటర్.. 10 మంది ఎన్యూమరేటర్లపై ఒక సూపర్‌వైజర్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ విజ్ఞప్తి చేశారు.

చెక్కుల కోసం.. చక్కర్లు



గట్టు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

గట్టు: కళ్యాణ లక్ష్మీ లబ్ధిదారులు చెక్కుల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టు చక్కర్లు కొడుతున్నారు. ఇటీవల గద్వాలలో కళ్యాణ లక్ష్మీ లబ్ధిదారులకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో సమాచారం లోపం కారణంగా కొంత మంది లబ్ధిదారులు పంపిణీ కార్యక్రమంలో హాజరుకాలేదు. గట్టు మండలంలో సుమారు 20 మంది వరకు లబ్ధిదారులు చెక్కులు అందుకోలేక పోయారు. ఇలా చెక్కులు అందుకోలేక పోయిన లబ్ధిదారులు చెక్కులు తీసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయానికి రెండు రోజులుగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. మంగళవారం కలెక్టర్ బీఎం సంతోష్ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న తరుణంలో ఇందువాసికి చెందిన మరియమ్మ, బల్గెరకు చెందిన తారమ్మ, నిర్మలమ్మ, గంగిమాన్‌దొడ్డికి చెందిన సువార్తమ్మ చెక్కుల విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ వెళ్లిపోయిన తర్వాత కూడా చెక్కులు అందించక పోవడంతో లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. చెక్కులు అందజేయకుండా తహసీల్దార్ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఇందువాసి, బల్గెర, గంగిమాన్‌దొడ్డి గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ఆరోపించారు. ఈ విషయంపై తహసీల్దార్ సరితారాణిని వివరణ కోరగా ఎమ్మెల్యే చేతుల మీదుగానే ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నందున ఆలస్యమైనట్లు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రత్నకరం కోటం రాజు

గద్వాల అర్బన్: భవన నిర్మాణ కార్మికులకు ఇసుక, వెల్ఫేర్ బోర్డులో పెండింగ్ క్లెయిమ్ తదితర సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధం రాష్ట్ర కార్యదర్శి రత్నకరం కోటం రాజు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవనంలో సంఘ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్షలాది మంది నిర్మాణ రంగంపై ఆధారపడి ఉన్నారన్నారు. వెల్ఫేర్ బోర్డులోని కొన్ని స్కీంలను ప్రైవేటు కంపెనీలకు అప్పగించే నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, వీవీ నర్సింహ్మా, రామకృష్ణ, వెంకటేష్, కోటేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల రూరల్: మండలంలోని బీరెల్లి, పూడురు, వీరాపురం సబ్ స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడం, శిథిలావస్థకు చేరిన స్తంభాల మార్పు తదితర పనుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, వినియోగ దారులు సహకరించాలని కోరారు.

మల్దకల్: మండలంలోని మద్దెలబండ, తాటికుంట, నాగర్‌దొడ్డి, మల్దకల్ విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతులు, ఇతర పనుల కారణంగా బుధవారం ఉదయం 11గంటల నుంచి 1గంట వరకు ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అయిజ ఏడీఈ గోవిందు, మల్దకల్ ఏఈ దుర్గప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు సహకరించవలసిందిగా కోరారు.

జోనల్ స్థాయిలో మూడో స్థానం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదవుతున్న రవితేజ అండర్–14 ఎస్‌జీఎఫ్ క్రీడల్లో జోనల్ స్థాయిలో షాట్‌పుట్ విభాగంలో మూడో స్థానంలో నిలిచినట్లు పీడీ శైలజ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రధానోపాధ్యాయురాలు హేమలత, ఉపాధ్యాయులు అభినందించారు.

స్టిక్కర్లు వేశారు.. తొలగించారు



ఉండవెల్లి(మానవపాడు): మండలంలోని జాతీయ రహదారిపై ఆర్‌టీఏ సరిహద్దు చెక్ పోస్టు వద్ద బారిగేట్లు ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం బారీ గేట్లకు రాష్ట్ర కొత్త లోగో ఏర్పాటు చేయడంతో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఇదిలా ఉండగా కలెక్టర్ దృష్టికి వెల్లడంతో బారిగేట్లకు ఏర్పాటు చేసిన స్టిక్లర్లు తొలగించారు. రూపకల్పనలో ఉన్న రాష్ట్ర చిహ్నం వేయడంతో సిబ్బంది స్టిక్లర్లు తొలగించారు.

రైతులకు సంపూర్ణ సహకారం



అయిజ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు సంపూర్ణ సహకారం అందిస్తున్నాయని డీసీసీబీ డిప్యూటీ జనరల్ మేనేజర్ దమయంతి అన్నారు. క్షేత్ర స్థాయి తనిఖీల్లో భాగంగా మంగళవారం బ్యాంక్ అధికారులతో కలిసి అయిజ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, సూపర్ మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు అంటే కేవలం స్వల్పకాలిక, దీర్ఘకాలిక అప్పులు మంజూరు చేసే సంస్థగా ప్రజల్లో గుర్తింపు ఉందన్నారు. ఇప్పుడు రైతులకు ఎరువులు, పురుగు మందులు కూడా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అయిజ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం స్వల్ప కాలంలోనే మంచి అభివృద్ధి సాధించి ఇతర సొసైటీలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, డీసీసీబీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రమేష్, గద్వాల బ్రాంచ్ మేనేజర్ ఆంజనేయులు, సూపర్‌వైజర్ రవికుమార్, సిబ్బంది జీవన్, భీమార్జున్ రెడ్డి, రాజు, శిరీష, లావణ్య, శారద, లక్ష్మి దీప్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు



శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పైపాడు మిట్టలపై వెలసిన శ్రీసద్గురు ఆదినారాయణ స్వామి 37వ ఆరాధనోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పూజల్లో పీఠాధిపతి పెద్దపుల్లయ్య స్వామి ఆధ్వర్యంలో వారి పుత్రుడు మొగరాజు చంద్రశేఖర్, శైలజ పాల్గొన్నారు. కలశ స్థాపన, పతాకావిష్కరణ, ఈశ్వరమ్మ అమ్మవారికి, చిన్న పుల్లయ్య స్వాములకు అభిషేకాలు చేశారు. శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం భక్తి శ్రద్ధలతో జరిపించారు. అనంతరం ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సద్గురు ఆదినారాయణ స్వామి శిష్యులు, కొంకల భజన భక్తులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ధరూరులో ఘరానా మోసగాడు

- ఫోన్ పే చేస్తానని నమ్మించి జారుకున్న వైనం
- పోలీసులను ఆశ్రయించిన వ్యాపారులు



వ్యాపారులను బోల్తా కొట్టించిన నిందితుడు

ధరూరు: మండల కేంద్రంలో పట్ట పగలు ఓ ఘరానా మోసం చోటు చేసుకుంది. ఫోనే పే చేస్తానని నమ్మించి అర గంటలో నాలుగు దుకాణాల్లో నమ్మించి మోసం చేశాడో యువకుడు. మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో ఓ చికెన్ దుకాణం వద్దకు వచ్చి 10 కిలోల చికెన్, 10 కిలోల మటర్ కావాలని ఆర్డర్ చేశాడు. మటన్ లేదనడంతో రూ. 4,100 క్యాష్ కావాలని మొత్తం కలిపి ఫోన్ పే చేస్తానని చెప్పి మటన్ ఆర్డర్ ఇచ్చి వస్తానని అక్కడి నుంచి ఉడాయించాడు. ఓ హార్డ్‌వేర్ షాప్‌కు వెళ్లి 16 తట్టలు, 4 సలిగెలు, పైపులు, దస్తర్లు తదితర సరుకులు ఆర్డర్ చేసి అక్కడ కూడా రూ.4,600 తీసుకున్నాడు. ఫోన్ పే చేస్తానని చెప్పి ఆటో తీసుకు వస్తానని చెప్పి వెళ్లిపోతున్నాడు. గమనించిన యజమాని మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఇంటి ముందు కనిపించడంతో గట్టిగా అడగంతో చేతికి ఇచ్చిన రూ.4,600 అతనికి ఇచ్చాడు. అనంతరం ఓ సిమెంట్ దుకాణం వద్దకు వచ్చి 17 సంచులు సిమెంటు కావాలని అడిగాడు. ఎక్కడికి బాబు.. ఏ ఊరు మీది అని వ్యాపారి అడుగగా.. మాది ధరూరే అన్న నిన్న మా డాడీ సిమెంట్ తీసుకెళ్లాడు కదా అనడంతో...నువ్వు కిందిగేరి బోయ బతుకన్న కుమారుడివా అని అన్న ఆ ఒక్క మాటను క్యాచ్ చేసుకుని మాయ మాటలు చెప్పి రూ. 10 వేలు డబ్బులు తీసుకుని అక్కడి నుంచి జారుకున్నాడు. వ్యాపారులు పలుచోట్ల గాలించినా ప్రయోజనం లేకపోవడంతో రేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.